కథ

# కల్లోలిత

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి
99488 96984

అర్ధరాత్రి పన్నెండు గంటలవేళ ఫోన్ రింగైంది. అది రామ్లా ఫోను. దాని కోసం ఎన్నోరోజులుగా ఎదురుచూస్తున్నాడు విశ్వనాథ్. అందుకే వెంటనే ఫోన్ ఎత్తి మాట్లాడాడు.

చివరిగా అతనెక్కడున్నాడో కనుక్కున్నాడు.

''మీ ఇంటిముందే ఉన్నాను సార్!'' అనగానే.. హడావుడిగా బైటికొచ్చాడు విశ్వనాథ్.

ఎదురుగా నిలబడి ఉన్నాడు రామ్లా. అతని ముఖంలో ఆవేదన – ఆందోళన – ఆవేశాలు కలగలసిన భావాలెన్నో నీడల్లా కదలాడుతున్నాయి. రామ్లా ఒక్కడే రాలేదు. పక్కనే పదమూడేళ్ల అమ్మాయి ఉంది.

ఆమెవైపు అనుమానంగా చూస్తూ..

''రండి.. లోపలికి!'' అన్నాడు విశ్వనాథ్.

రామ్లా కదల్లేదు. ఉన్నచోటే నిలబడిపోయాడు. దాంతో అతనేదో తీవ్రమైన సమస్యలో ఉండటం వల్లే సందేహిస్తున్నాడని అర్థమైంది. అందుకే..

''ఏం భయం లేదు. రా!''..

అంటూ లోపలికి దారితీశాడు విశ్వనాథ్. మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ లోపలికి నడిచాడు రామ్లా. అతని వెనకే వచ్చింది మెహక్. విశ్వనాథ్ కూర్చున్న సోఫాకు ఎదురుగా.. నేలమీద కూర్చున్నారిద్దరూ.

రామ్లా వయసు పదిహేడేళ్లు. గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. అతని తల్లి ఒకప్పుడు ఆ ఇంట్లో పనిచేసేది. రామ్లాను కూడా పనిలోకి పంపిస్తుంటే.. ఆమెకు నచ్చజెప్పి బడిలో చేర్పించాడు విశ్వనాథ్. అతను శ్రద్ధగా చదువుకుంటూ మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు. అలాంటి బుద్ధిమంతుడు ఉన్నట్టుండి మాయమైపోయాడు. నెలరోజులు దాటాక వేళకాని వేళలో ఇలా హఠాత్తుగా ఎవరో అమ్మాయితో ప్రత్యక్షమయ్యాడు.

ఎదురుగా తలవంచుకుని కూర్చున్న మెహక్‌ను పరిశీలనగా చూశాడు విశ్వనాథ్. తీర్చిదిద్దిన కుందనపు బొమ్మలా ఉంది. కానీ.. ముద్దులు మూటగట్టే ఆ మొహం నిండా అలజడి. ఒక సామాజిక కార్యకర్తగా తను ఎందరో శాపగ్రస్తుల ముఖాలను చూశాడు. కానీ, అంతటి కల్లోలితమైన ముఖాన్ని చూడటం అదే మొదటి సారి. అందుకే ఏం మాట్లాడాలో పాలుపోక అలాగే చూస్తూండిపోయాడు.

రామ్లా మాత్రం పరీక్షలకు సిద్ధమై వచ్చిన విద్యార్థిలాగా చెప్పడం మొదలుపెట్టాడు.

''సార్! నేను చేసే పనికి మీరు ఒప్పుకోరు. కానీ, నాకు మీరు తప్ప ఎవరూ లేరు. అందుకే ఇంతదూరం వచ్చాను''.. అంతవరకూ ధైర్యంగానే చెప్పాడుగానీ, అసలు విషయం దగ్గరకొచ్చేసరికి.. సగంలో సమాధానం మర్చిపోయిన విద్యార్థిలా నేలచూపులు చూడటం మొదలెట్టాడు. అతనికి ధైర్యం చెబుతున్నట్లుగా..

''అవన్నీ సరేగానీ.. ముందు విషయం చెప్పు'' అన్నాడు విశ్వనాథ్.

అయినా రామ్లాకు ధైర్యం చాలలేదు. అలాగని ఇప్పుడు చెప్పకపోతే మరో అవకాశం రాదు. అందుకే గుండెల్లోని ధైర్యాన్నంతటినీ కూడగట్టుకుని పాఠం అప్పగించినట్లు గబగబా చెప్పేశాడు.

''తన పేరు మెహక్. ఎయిత్ క్లాస్ చదువుతున్నది. తనను నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను!''.

చివరిమాట వినగానే విశ్వనాథ్‌కు మతిపోయింది. తను సరిగా విన్నాడో లేదో నిర్ధారించుకోవడం కోసం రెట్టించాడు.

''ఏంటీ?''.

రామ్లా ఏమాత్రం తడుముకోకుండా..

''నేను మెహక్‌ను పెళ్లి చేసుకుంటాను''..

దృఢంగా చెప్పాడు.

అతను ఎంత దృఢంగా చెప్పాడో.. అంతకంటే గట్టిగా అతని చెంపమీద కొట్టాడు విశ్వనాథ్. ఆ దెబ్బకు దిమ్మదిరిగి వెళ్లి అంతదూరంలో పడ్డాడు రామ్లా. తరువాత మెల్లగా వచ్చి మళ్లీ విశ్వనాథ్ ముందు కూర్చున్నాడు. కన్నవారిని కూడా కాదని తనను వెతుక్కుంటూ వచ్చాడు రామ్లా. అలాంటి వాడిమీద చెయ్యి చేసుకోవడం సంస్కారం కాదు. అందుకే అపరాధభావంతో కూర్చున్నచోటే ఉండిపోయాడు విశ్వనాథ్. కొంతసేపటికి తనే తేరుకుంటూ అడిగాడు.

''ఈ విషయం మీ అమ్మానాన్నలకు తెలుసా?''.

''తెలుసు సార్. మా పెళ్లి కుదిర్చింది వాళ్లే!''.

''మరా పెళ్లేదో అక్కడే చేసుకుని ఉండచ్చుగా? ఇక్కడికొచ్చి దెబ్బలు తినడం ఎందుకు?''.

''ఇప్పుడు వాళ్లే ఒప్పుకోవడం లేదు''.

''ఎవరు ఒప్పుకొన్నా.. ఒప్పుకోకపోయినా బాల్యవివాహం చట్టప్రకారం నేరం! మీరు పెళ్లి చేసుకుంటే ఇద్దర్నీ జైల్లో పెడతారు''.

''అదే నిజమైతే.. నేను జైల్లోనే పుట్టుండేవాణ్ని సార్. బాల్యవివాహం చేసుకున్నందుకు మా అమ్మానాన్నల్ని జైల్లో ఎందుకు పెట్టలేదు?''.

''వారి పెళ్లికి చట్టబద్ధత లేదు. అది వారి అమాయకత్వం వల్ల చేజేతులా తెచ్చిపెట్టుకున్న సమస్య. చట్టం




'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.